క్లుప్తంగా

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



నూతన కార్యవర్గంతో ఎమ్మెల్యే హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రెడ్లలో వెనుకబడిన వారికి నూతన కార్యవర్గం అండగా నిలవాలన్నారు. పేద విద్యార్థుల చదువుకు ఆర్థికంగా సహకరించాలని సూచించారు. రాజా బహదూర్ వెంకట రామిరెడ్డి స్ఫూర్తితో సిద్దిపేట సంఘం సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, రెడ్డి సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి హక్కుల కోసం ఉద్యమించిన జార్జిరెడ్డి

గజ్వేల్‌రూరల్: విద్యార్థి హక్కుల కోసం ఉద్యమించిన నాయకుడు జార్జిరెడ్డి అని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. బాలుర హబ్‌లోగల వసతి గృహంలో ఆదివారం జార్జిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీలో కొనసాగిన ఆధిపత్య భావజాలానికి వ్యతిరేకంగా, అట్టడుగు వర్గాల విద్యార్థుల హక్కుల కోసం జార్జిరెడ్డి ఉద్యమించాడన్నారు. ఓయూలో ప్రజాస్వామ్య వాతావరణం నెలకొల్పి విద్యార్థి సంఘం ఎన్నికల్లో జెండాను ఎగురవేశాడని గుర్తు చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు మహేందర్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



గాగిల్లాపూర్‌లో బోనాలతో వెళ్తున్న మహిళలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిల్లాపూర్‌లో రెడ్డి, మాల సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా మహిళలు బోనాలతో ఆలయానికి తరలి వచ్చి మొక్కులు చెల్లించుకొన్నారు. అమ్మవారిని దర్శించుకొని వర్షాలు సమృద్ధిగా కురవాలని వేడుకొన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు ప్రోత్సాహం



సమావేశంలో మాట్లాడుతున్న బాబు

సిద్దిపేటజోన్: గ్రామీణ యువతను ప్రోత్సహించేందుకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని బీజేఆర్ సంక్షేమ సంఘం ప్రతినిధి పెరక బాబు చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో పట్టణ, వివిధ గ్రామాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

సన్న బువ్వ సంబురం



లక్ష్మిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): తెల్లరేషన్ కార్డు దారులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం నిరుపేదల్లో ఆనందాన్ని నింపుతోంది. అందుకు మండల కేంద్రానికి చెందిన చిరు వ్యాపారి నిదర్శనంగా నిలుస్తోంది. వారాంతపు సంతలో చేపలను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారి లక్ష్మి రేషన్ దుకాణంలో పంపిణీ చేసిన 24 కిలోల సన్న బియ్యంతో ఆదివారం సుమారు వంద మందికి పైగా స్థానికులు, నాయకులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసింది. భోజనాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు లక్ష్మిని పట్టు చీరతో సత్కరించారు. సన్న బియ్యంతో స్వచ్ఛందంగా భోజనాలు ఏర్పాటు చేయడంతో లక్ష్మిని పలువురు అభినందించారు.

సౌకర్యాలకు స్వస్తి!

- ఉపాధి కూలీలకు అందని పరికరాలు ● గిట్టుబాటు కాని కూలి
- పని ప్రదేశాల్లో నీడ, తాగునీరు కరువు ● ఎండలో కూలీల ఇబ్బందులు

జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు కల్పించే వసతులు, సౌకర్యాలు రోజురోజుకు దూరమవుతున్నాయి. అసలే గిట్టుబాటు కాని కూలి. అది కూడా సక్రమంగా చెల్లించని పరిస్థితి. దానికి తోడు చాలా చోట్ల కూలీలకు పరికరాలు కూడా అందించంలేదు. పని ప్రదేశాలలో కనీసం తాగునీరు, నీడ లాంటివి కూడా కల్పించని దుస్థితి. ఇక మెడికల్ కిట్లు సరేసరి. ఎండలు అధికమవుతున్న క్రమంలో ఉపాధి కూలీలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



తాడూరులో కొనసాగుతున్న ఉపాధి పనులు

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అయితే పని ప్రదేశాల్లో కూలీలకు నీడ కోసం గ్రీన్ షెడ్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ పట్టించుకునే వారు లేకుండా పోయారు. గతంలో పని ప్రదేశాల్లో గుడారాలు ఏర్పాటు చేసి, తాగునీటి వసతి, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచేవారు. పనిలేని సమయంలో విశ్రాంతి తీసుకోవడానికి వసతి లేక కూలీలు తంటాలు పడుతున్నారు. కొన్ని చోట్ల గ్రీన్ షెడ్లు వేస్తున్నా.. మరి కొన్ని చోట్ల ఆ పరిస్థితిలేదు. దీంతో తప్పనిసరి పరిస్థితిలో మండుటెండలోనే కూలీలు పనిచేయాల్సి వస్తోంది.

అందని పనిముట్లు

కనీస వసతులు కల్పించకపోగా ఇవ్వాల్సిన కూలి డబ్బుల చెల్లింపుల్లో కూడా తీవ్రమైన జాప్యం జరుగుతోంది. దానికి తోడు గడిచిన పదేళ్లుగా పార, గడ్డపార, తట్టలు లాంటి పనిముట్లు అందించడం లేదు. దీంతో కూలీలే సొంతంగా వాటిని సమకూర్చుకోవాల్సి వస్తోంది. అసలే కూలి తక్కువ.



కొత్త దొమ్మాటలో పనుల్లో నిమగ్నమైన కూలీలు

దానికి తోడు పనిముట్లు కూడా కొనుక్కోవాలంటే ఎలా అంటూ కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదేనా.. ఆర్థిక భరోసా

ఉపాధి కూలీలకు ఆర్థిక భరోసా కల్పిస్తానంటూ ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ఇదేనా అంటూ కూలీలు వాపోతున్నారు. ఎండ తీవ్రత పెరగడంతో తాగునీరు వారే వెంట తీసుకెళ్తున్నారు. పనిచేసే సమయంలో గ్రీన్‌షెడ్లు లేక సమీపంలోని చెట్ల నీడనే సేదతీరుతున్నారు. కూలీలకు అందిస్తానన్న భరోసా అందరికీ అందడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

గడ్డపార, పారలు అందజేయాలి



పదేళ్లుగా పనులు చేస్తున్నా పనిముట్లు సరఫరా చేయడంలేదు. పారలు, గడ్డపారలు తట్టలు లేక సొంతంగా చేయించుకుని ఇంటి నుంచి ప్రతిరోజు మోసుకురావాల్సి వస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో కూలి గిట్టుబాటు కావడం లేదు. అందులోకి పనిముట్లు కూడా కొనాలంటే చాలా కష్టంగా ఉంది. ప్రభుత్వమే సరఫరా చేస్తే బాగుంటుంది. అలాగే పని ప్రదేశంలో అన్ని సౌకర్యాలు కల్పించాలి.

– కదారి నరేశ్, ఉపాధి హామీ కూలీ, ఆకునూరు

కూలి గిట్టుబాటు కావడంలేదు



ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వారికి కూలి గిట్టుబాటు కావడం లేదు. ఆరు గంటలు పనిచేస్తే రూ.250 మాత్రమే చెల్లిస్తున్నారు. ఎండలు ఎక్కువగా ఉన్న సమయంలో పని ఆపితే హాజరు వేయడం లేదు. కూలి రెట్టింపు చేస్తేనే గిట్టుబాటవుతుంది. కూలీలకు ఏడాదికి 200 పనిదినాలు కల్పించి, రోజుకు రూ.500ల చొప్పున చెల్లించాలి.

– శాస్త్రిలక్ష్మి, తాడూరు, ఉపాధి హామీ కూలీ

పంచాయతీలదే బాధ్యత



వేసవి దృష్ట్యా కూలీలకు ఎండదెబ్బ తగలకుండా ఉదయం 6 నుంచి 11 గంటల వరకే పనిచేయాలి. గడ్డపార, పార, తట్ట, తాగునీటి కోసం గతంలో ప్రతిరోజు రూ.5 వరకు అదనంగా కూలీలకు వచ్చేది. ప్రస్తుతం తాగునీటి సౌకర్యం గ్రామ పంచాయతీల ద్వారా చేస్తున్నారు. అందుకు కూలీకి రూ.2 చొప్పున గ్రామ పంచాయతీకి వస్తున్నాయి. గ్రీన్ షెడ్ల ఏర్పాటు పంచాయితీలే చేస్తున్నాయి.

– మహబూబ్ అలీ, ఎంపీడీఓ, చేర్యాల

రైతుల సంక్షేమం కోసం కృషిచేయాలి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం కృషిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కోరారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో మిరుదొడ్డితో పాటు, చెప్యాల, కాసులాబాద్, అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతె, భూంపల్లి, బేగంపేటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు సమకూర్చాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రాజలింగారెడ్డి, రాజు, పోలీస్ రాజులు, సత్యనారాయణ, లింగం, అంజిరెడ్డి, రవి, శ్రీనివాస్, భిక్షపతి, రంజిత్, ఎల్లయ్య, స్వామి, నర్సింహులు పాల్గొన్నారు.



మోతెలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకటయ్య

దేశానికి దిక్సూచి అంబేడ్కర్

దౌల్తాబాద్(దుబ్బాక): డా.బీఆర్ అంబేడ్కర్ భారత దేశానికి దిక్సూచి అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ముబారస్‌పూర్ చౌరస్తాలో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆయన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన గొప్ప వ్యక్తి బాబాసాహెబ్ అంబేడ్కర్ అన్నారు. కార్యక్రమంలో విగ్రహదాత స్వామి, డీబీఎఫ్ శంకర్, వెంకట్‌రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుంటేనే మనుగడ



మాట్లాడుతున్న లింగమూర్తి తదితరులు

- ప్రజలను మేల్కొల్పడానికే పాదయాత్ర
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి

అక్కన్నపేట(హుస్నాబాద్): రాజ్యాంగాన్ని రక్షించుకుంటేనే మనుగడ సాధ్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. అక్కన్నపేటతో పాటు అంతక్కపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య ఆధ్వర్యంలో ఆదివారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాదయాత్రకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. ఇటీవల పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి అమిత్ షా గాంధీజీ, అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు గ్రామాల్లో ఈ పాదయాత్ర చేపట్టారన్నారు. అలాగే కేంద్రంలోని బీజేపీ రాజ్యాంగ విలువలను కాలరాస్తూ మనువాద రాజ్యాంగాన్ని తీసుకురావాలని ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ శివయ్య, మండలాధ్యక్షుడు అయిలయ్య, మాజీ సర్పంచ్ సంజీవ్‌రెడ్డి, రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు భాస్కర్‌నాయక్, రమేశ్, మల్లారెడ్డి, రమేశ్, పులికాశి రమేశ్, రవి, దాము, సారయ్య, కనకయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడటమే లక్ష్యం

చిన్నకోడూరు(సిద్దిపేట): రాజ్యాంగాన్ని కాపాడుకొనే బాధ్యత కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని డీసీసీ ప్రధాన కార్యదర్శి సాకి ఆనంద్ అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం చేపట్టిన పాదయాత్ర మండల పరిధిలోని అల్లీపూర్, కమ్మర్లపల్లి, ఎల్లాయపల్లి, కిష్టాపూర్ గ్రామాల్లో ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మీసం మహేందర్, రాజు, పరశురాములు, జయంత్, ప్రశాంత్, గణేశ్, వినోద్, జగన్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నకోడూరు(సిద్దిపేట): అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకుల నివాళి

కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లిల మండల పరిధిలోని కూడవెల్లి, అక్బర్‌పేట గ్రామాల్లో ఆదివారం కాంగ్రెస్ నాయకులు జై బాపు, జై బీం, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని అంబేడ్కర్, గాంధీ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగాన్ని కాపాడుతామంటూ ప్రతిన భూనారు. కార్యక్రమంలో దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకట్‌స్వామి గౌడ్, ఆయా గ్రామ కమిటీల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోవాలి



రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే

నంగునూరు(సిద్దిపేట): యువత శ్రీరామచంద్రుడిని ఆదర్శంగా తీసుకొని సన్మార్గంలో నడవాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. రాంపూర్ లోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి రథోత్సవంలో పాల్గొని గ్రామ వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో లింగంగౌడ్, పర్శరాములు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని దమ్మక్కపల్లికి చెందిన బండి చంద్రం కుటుంబానికి జాగృతి రాష్ట్ర కార్యదర్శి అనంతుల ప్రశాంత్ ఆదివారం రూ.10 వేలు ఆర్థిక సహాయం చేశారు. బండి చంద్రం అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఆయన ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దళిత బహుజన హక్కుల ప్రచారోద్యమం

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

గజ్వేల్‌రూరల్: మహనీయుల మహోత్సవాల్లో భాగంగా దళిత బహుజన హక్కుల సాధికారిక ప్రచారోద్యమాన్ని ప్రారంభించామని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ చెప్పారు. స్థానిక ఆర్ అండ్ఆర్ కాలనీ(ఎర్రవల్లి)లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ బాల్యం వివక్షతో నిండినప్పటికీ విదేశాల్లో ఆర్థికశాస్త్రంలో డాక్టరేట్ పొందిన మొదటి దళితుడిగా ఎదిగారన్నారు. సామాజిక సాధికారిత, కులవివక్ష వ్యతిరేక ఉద్యమానికి అంబేడ్కర్ జయంతి రోజు ప్రతీకగా మారిందని చెప్పారు. మల్లన్న సాగర్ ముంపు గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఏగొండ స్వామి, మైసయ్య ముంపు గ్రామాల మహిళలు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న శంకర్

శాస్త్రీయ ఆలోచనతోనే సామాజిక న్యాయం

మెదక్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్

సిద్దిపేట ఎడ్యుకేషన్: శాస్త్రీయ ఆలోచనతోనే సామాజిక న్యాయం సాధ్యమని మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ సిద్దిపేట రీజినల్ స్టడీ సెంటర్లో ఆదివారం అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలలో భాగంగా 'భారత రాజ్యాంగం సామాజిక న్యాయం' అనే అంశంపై హుస్సేన్ మాట్లాడారు. రాజ్యాంగం ద్వారా దేశంలోని అట్టడుగు వర్గాలకు కూడా న్యాయం జరిగిందన్నారు. రాజ్యాంగం ద్వారా అంటరానితనం భౌతికంగా దూరమైనప్పటికీ మనుషుల మెదళ్లలో కుల వివక్ష ఇప్పటికీ కొనసాగుతుందని, శాస్త్రీయంగా ఆలోచించినపుడే దానిని అంతం చేయగలమని చెప్పారు. అనంతరం డాక్టర్ గోపాల సుదర్శనం, రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రద్ధానందం మాట్లాడారు. రాజ్యాంగ పీఠికపై నిర్వహించిన ఉపన్యాస పోటీలో విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సామ సువర్ణదేవి, సీనియర్ కౌన్సిలర్ బాలకిషన్, విష్ణుమూర్తి, రామాశ్రీ, పవన్, శ్రీకాంత్, రమేశ్, రమణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హుస్సేన్

కేంద్ర ప్రభుత్వంపై బురద జల్లుతున్న కాంగ్రెస్

దుబ్బాకటౌన్: జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర పేరుతో కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వంపై బురద జల్లుతోందని బీజేపీ రాయపోల్ మండల అధ్యక్షుడు మంకిడి స్వామి మండిపడ్డారు. మండల పరిధిలోని పలువురు లబ్ధిదారులైన శివలక్ష్మికి రూ.43,500, చిన్న యాదయ్యకు రూ.55,500, కవితకు రూ.36 వేలు, లక్ష్మికి రూ.55,500, మారుతికి రూ.19,500, ఉదయశ్రీకి రూ.54 వేలు, మౌనికకు రూ.48 వేలు, మహేశ్‌కు రూ.25,500, రాజయ్యకు రూ.14 వేలు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, నాయకులు వెంకట్‌గౌడ్, కృష్ణ, స్వామి లక్ష్మణ్, నర్సింహులు, వీరేశం, స్వామి, నవీన్, రాజు, మహేందర్ తదితరులున్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న నాయకులు

ఓబీసీల ఆత్మ గౌరవాన్ని కాపాడిన మండల్



మండల్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

బీసీ సంఘాల నాయకులు

హుస్నాబాద్: దేశంలో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించి వారి ఆత్మ గౌరవాన్ని కాపాడిన గొప్ప నాయకుడు బీపీ మండల్ అని బీసీ నాయకులు కొనియాడారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఆదివారం మండల్ కమిషన్ చైర్మన్ బీపీ మండల్ యాదవ్ 43వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంఘం నాయకులు మాట్లాడుతూ మండల్ కమిషన్ నివేదిక పూర్తిచేసి సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీపీ మండల్‌కు భారతరత్న ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజు, రవీందర్‌గౌడ్, సుభాష్, యాదవ్, మల్లేశం, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

గజ్వేల్‌రూరల్: పౌష్టికాహారం తీసుకొంటేనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని కొండపోచమ్మ దేవస్థాన మాజీ డైరెక్టర్ నిమ్మ రమేశ్ అన్నారు. స్థానిక ఆర్ అండ్ఆర్ కాలనీ(పల్లెపహాడ్)లో గజ్వేల్‌కు చెందిన సాయి దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శిబిరం నిర్వాహకులు మాట్లాడుతూ వారం రోజుల పాటు వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. శిబిరంలో సుమారు వంద మందికి దంత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. వైద్యురాలు రోజారాణి, నిర్వాహకులు సాయి శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న రోజారాణి

వేసవిలో బదిలీలు, ప్రమోషన్లు చేపట్టండి

- పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి
- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నేత యాదగిరి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఈ వేసవిలో ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. యూనియన్ కార్యాలయంలో ఆదివారం ఫెడరేషన్ 12వ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం యాదగిరి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో టీఎస్‌యూటీఎఫ్ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. రెండేళ్ళుగా ఈ-కుబేర్‌లో పెండింగులో ఉన్న బిల్లులన్నింటినీ వెంటనే విడుదల చేయాలని, రెండో పీఆర్సీ నివేదికను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. నాయకులు కృష్ణ, నగేశ్, కనకరాజు, గిరిబాబు, నర్సింహులు, గణేశ్, భిక్షపతి, గోవర్ధన్, రాకేష్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జెండా ఆవిష్కరిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

అంతరాలు లేని విద్యాసాధనే లక్ష్యం

చేర్యాల(సిద్దిపేట): అంతరాలు లేని విద్యాసాధనే తమ లక్ష్యమని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కొడిపల్లి ప్రశాంత్ కుమార్ అన్నారు. స్థానిక అంగడి బజారులో మండల ప్రధాన కార్యదర్శి పిల్లి రాజు అధ్యక్షతన జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమానికి నిరంతరం పోరాడదాం అన్నారు. మద్దూరు మండల కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు పురుషోత్తం కనుకరెడ్డి, ప్రసాద్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్‌రూరల్: టీఎస్‌యూటీఎఫ్ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు నివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వలీ అహ్మద్, రాష్ట్ర నాయకుడు సత్యనారాయణ, వెంకటకిరణ్, ప్రభావతిలు పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం టీఎస్‌యూటీఎఫ్ ముందుండి పోరాడుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నిర్మల, రవీందర్, సుధాకర్, వెంకటేశం, మహబూబ్‌పాష, ప్రశాంత్, కృష్ణ, మహేశ్వరి, శ్రీనివాస్, వెంకటస్వామి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.